సాక్షి జగిత్యాల

మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023

న్యూస్‌రీల్

నృసింహుని హుండీ ఆదాయం రూ.12.35లక్షలు



నగదు లెక్కిస్తున్న సిబ్బంది

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు 12రోజులపాటు జరిగాయి. వీటితోపాటు మరోమూడు నెలలకు సంబంధించిన హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. మొత్తం రూ.12,35,014 ఆదాయం సమకూరింది. మిశ్రమ బంగారం 0.7 గ్రాములు, మిశ్రమ వెండి 1.680 గ్రాములు లభించింది. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, కేడీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, ఆలయ చైర్మన్ నేరెళ్ల సుమన్‌గౌడ్, ఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు మహర్దశ



తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలటౌన్: పట్టణంలోని ఆలయాలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి పాటుపడుతున్నామని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రధాన మార్కెట్‌లోని శ్రీనివాస, భవానీ, శంకర, ఆంజనేయ స్వాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ రెనోవేషన్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి విశేష కృషి జరుగుతోందని పేర్కొన్నారు. గుట్ట రాజేశ్వర స్వామి ఆలయానికి రోడ్డు నిర్మించి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత, బల్దియా చైర్‌పర్సన్ గోలి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ జీఆర్ దేశాయ్, కౌన్సిలర్లు బొడ్ల జగదీశ్, పంబాల రాంకుమార్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడకు ప్రత్యేక బస్సులు

కోరుట్ల: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ శైవక్షేత్రమైన వేములవాడకు కోరుట్ల డిపో నుంచి ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ లక్ష్మీప్రసూన సోమవారం తెలిపారు. ఈనెల 17, 18, 19వ తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. 30 మంది ప్రయాణికులు ఉంటే నేరుగా వేములవాడకు బస్సు పంపుతామని పేర్కొన్నారు. ప్రయాణికులు జీపులు, ఆటోలు, టాటా మేజిక్‌ల వంటి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ఇబ్బందులు పడవద్దని ఆమె సూచించారు.

అరుణశ్రీకి సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: అదనపు కలెక్టర్‌గా సేవలు అందించి ఇటీవల ఐఏఎస్ హోదా పొందిన అరుణశ్రీని సోమవారం టీఎన్జీవో, ట్రెస్మా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం సన్మానించారు. నాయకులు భోగ శశిధర్, ఎండీ వకీల్, నాగేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్, సాయిబాబా, రవిచంద్ర, రాజేందర్, తిరుమల్‌రావు పాల్గొన్నారు.



- తీరం చేరిన ప్రేమకథలు
- లవ్‌లో లైఫ్‌లో గెలిచిన ప్రేమ పక్షులు
- ఆదర్శనీయంగా నిలుస్తున్న జంటలు
- నేడు వాలంటైన్స్ డే ప్రత్యేక కథనం

ఒప్పించాం.. మెప్పించాం!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రేమ.. కులమతాలకు అతీతమైన భావన. టీనేజీ వయసులో మొదలయ్యే ప్రేమకథలు ఆకర్షణతో మొదలై.. అక్కడితో ముగుస్తాయి. కానీ, పరిణితితో కూడిన ప్రేమకథలు కచ్చితంగా విజయతీరాలు చేరుతాయి. ఒక చేత్తో కెరీర్, మరో చేత్తో ప్రేమను సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతాయి. ఖండాలు దాటినా, ఏళ్లకేళ్లు గడిచినా ఎదురుచూపుల్లోనే బతికేస్తారు. చివరికి తమ లక్ష్యాన్ని చేరుకుంటారు. ఆ తరువాత పెద్దల్ని ఒప్పిస్తారు. కొందరికి ఈ అవకాశం లేకపోవచ్చు. అయినా వీరు చేరుకున్న విజయతీరాలు, సమాజంలో వీరికి దొరికే స్థానం వీరిపై ఉన్న వ్యతిరేక భావనను క్రమంగా దూరం చేస్తుంది, అందరినీ దగ్గర చేస్తుంది. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా కులమతాలకు అతీతంగా ప్రేమ వివాహాలు చేసుకుని నలుగురికీ ఆదర్శంగా నిలుస్తున్న ప్రేమజంటలపై కథనం.

మాది లవ్ కం అరేంజ్ మ్యారేజ్



సిరిసిల్లక్రైం: విద్యాభ్యాసం పూర్తి చేసి ఉద్యోగంలో సెటిల్ అయ్యాక మా స్నేహితులతో మా మధ్య ప్రేమ చిగురించింది. పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకోవాల్సిన అవసరం రాలేదు. అందరినీ ఒప్పించి సంప్రదాయ పద్ధతిలో పెళ్లి చేసుకున్నాం. నా భార్య దివ్యాన్షీ కంటి డాక్టర్. ఈ తరం యువతకు నేను చెప్పేది ఒక్కటే.. కెరీర్‌పై దృష్టి పెట్టి లక్ష్యం సాధిస్తే అన్నీ మనవద్దకు వచ్చి చేరుతాయి. ఆకర్షణకు గురైతే లైఫ్ ఆగమవుతుంది. – ఎస్పీ అఖిల్ మహాజన్– డాక్టర్ దివ్యాన్షీ దంపతులు

అనాథ యువతికి అన్నీ తానై..



కొడుకులతో శేఖర్, రమ్య దంపతులు

కథలాపూర్(వేములవాడ): అనాథ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకొని ఆదర్శంగా నిలిచాడు ఓ సామాజిక సేవకుడు. కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామానికి చెందిన కాసారపు శేఖర్ షైన్ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులులేని అదే గ్రామానికి చెందిన రమ్యను ప్రేమించాడు. 2013లో శేఖర్, రమ్య ప్రేమ వివాహం చేసుకున్నారు. తల్లిదండ్రులు లేని ఆమెకు అన్నీ తానయ్యాడు. వీరికి శ్రీహర్ష, రిషికేశ్ ఇద్దరు కుమారులు. శేఖర్ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో 2018లో గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. కులాంతరమే కాదు.. అనాథ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్న శేఖర్‌ను పలువురు గ్రామస్తులు తదితరులు అభినందించారు.

నేనే ప్రతిపాదించా..



ఏదో సందర్భంలో తన ఫ్రెండ్ ప్రశాంత్‌ను పరిచయం చేశారు. ఆ పరిచయమే కొన్నాళ్లకు ఇష్టంగా మారింది. ధైర్యం చేసి నేనే పెళ్లి ప్రేమను ప్రతిపాదించా. అమ్మానాన్న అంగీకరించలేదు. అగ్రహారం ఆంజనేయస్వామి సన్నిధిలో మేమే పెళ్లి చేసుకున్నాం. ప్రస్తుతం అంతా సంతోషంగానే ఉంది. – లహరి, ప్రశాంత్

ఓపికతో ఒప్పించారు..



రామగుండం: చింతమల్ల రవి డిగ్రీ చదువుతూనే కారు డ్రైవర్‌గా పని చేసేవాడు. ఆ సమయంలో ఉన్నత కుటుంబంలో పుట్టిన స్రవంతిని ప్రేమించాడు. విషయం అమ్మాయి కుటుంబంలో తెలియడంతో చదువు మాన్పించారు. 2013లో రవికి ప్రభుత్వ ఉద్యోగం(లోకో పైలెట్) వచ్చింది. ఆస్తి, అంతస్తులో తేడాలు వచ్చి ఆగిపోయింది. రెండేళ్లపాటు ఓపిక, సహనంతో వేచిచూశారు. చివరికి పెద్దలను ఒప్పించి 2015లో ఘనంగా పెళ్లి చేసుకున్నారు.

ఖండాలు దాటిన ప్రేమ



మా పరిచయం విచిత్రంగా జరిగింది. నేను ఎస్సార్ కాలేజీలో డిగ్రీ చదువుతున్న క్రమంలో నాకు రమేశ్ పరిచమయ్యాడు. ఒకరోజు నాకు ప్రపోజ్ చేశాడు. జీవితంలో పైకి రావాలన్న నా కలను వివరించా. పూర్తిగా సహకరించాడు. ఉన్నత విద్య కోసం బ్రిటన్ వెళ్లా. పీజీ పూర్తయి ఉద్యోగంలో చేరాక ఇండియా వచ్చా. రమేశ్‌తో వివాహం జరిగింది. కులాలు వేరుకావడంతో మొదట్లో మా పెద్దలు వ్యతిరేకించినా.. మా నిజాయతీ, కెరీర్‌లో నిలదొక్కుకున్న తీరుకు మా ప్రేమను అంగీకరించారు. ఇపుడు లండన్‌లో రెండు రెస్టారెంట్లు, ఒక కేక్‌షాప్ నడుపుతున్నాం. – సుష్మ– రమేశ్

ప్రేమ కోసం దేశంలోనే..



మాది మంథని, మా వారిది కరీంనగర్. నేను అపుడు పీజీ చదువుతున్నా. మా ఆయన ప్రభాకర్ అప్పటికే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. పెళ్లి వేడుకలో కలిశాం. చూపులు కలిశాయి. తర్వాత మా అభిప్రాయాలు కలిసి పెళ్లి చేసుకోవాలనుకున్నాం. పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నాం. మాకు ఇపుడు ఒక పాప. మా ప్రేమను అర్థం చేసుకున్న పెద్దలు చివరికి మమ్మల్ని క్షమించేశారు. ఇపుడు అంతా హ్యాపీ. హైదరాబాద్‌లో ఓ ఇంటి వారిమయ్యాం. విదేశాలకు వెళ్లే అవకాశాలు వచ్చినా మా పేరెంట్స్‌ను చూసుకునేందుకు మా ప్రభాకర్ వాటిని సున్నితంగా తిరస్కరిస్తారు. – స్వప్న– ప్రభాకర్

అప్పట్లో చాలా కష్టపడ్డాం



నాది జగిత్యాల జిల్లా. ఆమెది కరీంనగర్. డిగ్రీ చదువుకునే రోజుల్లో ఎన్‌సీసీలో పరిచయం. ఆ పరిచయం పీజీకి వెళ్లాక కూడా కొనసాగింది. అపుడే ఎస్సై నోటిఫికేషన్ వచ్చింది. దీంతో తనకు దాదాపుగా ఏడాది దూరంగా ఉండి ప్రిపేరయ్యా. ఈలోపు విషయం ఇంట్లో తెలిసిపోయింది. తన కుటుంబ సభ్యులు మొదట్లో వ్యతిరేకించారు. కానీ, నేను ఎస్సైగా సెలెక్ట్ అయ్యాక మరో ఏడాది దూరంగా ఉండాల్సి వచ్చింది. పోస్టింగ్ తీసుకున్నాక వెళ్లి వారిని ఒప్పించా. తొలుత వ్యతిరేకించినా... కొన్నిరోజులకు కలిసిపోయాం. ఇపుడు నేను సీఐగా మానుకోటలో విధులు నిర్వహిస్తున్నా. మాకిద్దరు పాపలు. కులాలు వేరైనా జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకుంటే అంతా ఆమోదిస్తారు. – సుష్మ– రవిరాజ్

'తేడా' తెలుసుకుంటే మేలు

కోరుట్ల: ఆరేళ్ల క్రితం ఓ గ్రామానికి చెందిన అబ్బాయి, అమ్మాయి హైదరాబాద్‌లో కాలేజీలో చదువుతుండగా ప్రేమలో పడ్డారు. పలు వేడుకల్లో సరదాగా అందరితో కలిసి ఫొటోలు దిగారు. ఏడాది క్రితం ఇద్దరి మధ్య అభిప్రాయాల్లో తేడాలు వచ్చాయి. ఇంటర్‌లో ఉన్న తీరు బీటెక్‌కు వచ్చే సరికి మారిపోయింది. ఇద్దరి మధ్య మెల్లగా గ్యాప్ వచ్చింది. చివరికి అమ్మాయి తల్లిదండ్రులు చూపిన అరెంజ్ మ్యారేజ్‌కు సిద్ధమయ్యింది. ఇది జీర్ణించుకోలేని అబ్బాయి పాత మార్ఫింగ్ ఫొటోలతో బ్లాక్‌మెయిల్‌కు దిగాడు. వ్యవహారం ఠాణాకు చేరింది. పోలీసులు ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. అబ్బాయి తన పొరపాటును గుర్తించి అమ్మాయికి దూరమయ్యాడు. ఒడిదుడుకుల మధ్య అమ్మాయికి అరెంజ్ మ్యారేజ్ జరిగింది.

టీనేజ్ ప్రేమతో సమస్యలు



చదువు పూర్తికాకుండానే టీనేజ్‌లో ప్రేమలో పడుతున్న వారు చాలామంది ఆ తర్వాత ప్రేమ, ఆకర్షణ తేడాలు తెలుసుకుని తమ అభిప్రాయాలు మార్చుకుంటున్నారు. ప్రేమికుల్లో ఏ ఒక్కరూ తమ అభిప్రాయాన్ని మార్చుకున్నా ఇంకొకరు గౌరవించాలి. అంతే కాని ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలు ఫేస్‌బుక్‌లు, వాట్సాప్‌ల్లో పెడతానని బ్లాక్‌మెయిలింగ్ దిగడం సరికాదు. ఇలాంటి విషయాల్లో అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలి. ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తే కచ్చితంగా కేసులు నమోదు చేస్తాం. – రాజశేఖర్‌రాజు, సీఐ, కోరుట్ల



నాచుపల్లి జేఎన్టీయూలో 'సాక్షి' డిబేట్‌లో పాల్గొన్న విద్యార్థులు

ప్రేమ మధురం .. పెళ్లి విశ్వాసం

- పెద్దలు కుదిర్చిన వివాహానికి సై
- లవ్ మ్యారేజీపై ఇష్టం
- 'సాక్షి' డిబేట్‌లో విద్యార్థులు

కొండగట్టు(చొప్పదండి): 'పెళ్లికి ముందు ప్రేమ.. పెళ్లి తర్వాత ప్రేమ.. మీరేమంటారు' అంశంపై నాచుపల్లి జేఎన్టీయూలో 'సాక్షి' ఆధ్వర్యంలో సోమవారం డిబేట్ నిర్వహించారు. ప్రేమించిన వ్యక్తిని వివాహం చేసుకుంటే.. సంసార జీవితం సాఫీగా సాగుతుందని, విభేదాలు తలెత్తినా సర్దుకుపోయే వాతావరణం ఉంటుందని కొందరు విద్యార్థులు అభిప్రాయపడ్డారు. అయితే, అటు కొన్ని తరాలు, ఇటుకొన్ని తరాల స్థితిగతులు పరిశీలించాకే వివాహం జరిపిస్తే దంపతులిద్దరూ జీవితాంతం హాయిగా బతుకుతారని మరికొందరు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. పలువురు వ్యక్తం చేసిన మనోభావాలు ఇవీ..

అరేంజ్ మ్యారేజీ ఇష్టం



పెద్దలు కుదుర్చిన అరేంజ్ మ్యారేజీ అంటేనే నాకు ఇష్టం. ఎలాంటి అబ్బాయి అయితే జోడీ కుదురుతుందనేది తల్లిదండ్రులు డిసైడ్ చేస్తారు. జీవితంలో ఏం జరిగినా వారి సపోర్టు ఉంటుంది. – సాయిశ్రీ, ఐటీ సెకండ్ ఇయర్, నాచుపల్లి జేఎన్టీయూ

లవ్ మ్యారేజీ బెటర్



లవ్ మ్యారేజీ బెటర్ కానీ, తల్లిదండ్రులకు వ్యతిరేకంగా కాకుండా వారిని ఒప్పించి పెళ్లి చేసుకోవాలి. లవ్ మ్యారేజీతో ఒకరికొకరు ఇష్టంతో బతుకవచ్చు. జీవితాంతం ఎలాంటి ఇబ్బందులు ఉండవనేది నా అభిప్రాయం. – వి.హారిక, ఐటీ సెకండ్ ఇయర్, నాచుపల్లి జేఎన్టీయూ

మోసపోవద్దు



లవ్ ఈజ్ ద బెస్ట్. అరెంజ్ మ్యారేజీ కూడా బాగానే ఉంటుంది. కానీ, లవ్ మ్యారేజీల్లో చాలామంది మోసపోతున్నారు. అలా కాకుండా తనకు ఇష్టమైన వారిని గురించి సంపూర్ణ వివరాలు తెలుసుకుంటే మోసపోరు. ఆ దిశగా యువత అప్రమత్తంగా ఉండాలి. – శివాని, ఐటీ, సెకండ్ ఇయర్, నాచుపల్లి జేఎన్టీయూ

ముందే తెలిసి ఉండాలి



లవ్ మ్యారేజీ బెస్ట్ అనుకుంటే.. భాగస్వామి గురించిన సమగ్ర సమాచారం మనకు ముందే తెలిసి ఉండాలి. అదే అరేంజ్ మ్యారేజీలో పెళ్లి అయ్యాక వివరాలు తెలుస్తాయి. అన్ని వివరాలు తెలిసిన వ్యక్తిని ముందుగానే ఎంచుకుంటాం కాబట్టి లవ్ మ్యారేజీ ద బెస్ట్. – హరిణి, ఐటీ సెకండ్ ఇయర్, నాచుపల్లి, జేఎన్టీయూ

గొడవలు సాధారణం



పెద్దలు కుదుర్చిన పెళ్లిలో కొన్ని అడ్జెస్ట్‌మెంట్లు ఉండవు. లవ్ మ్యారేజెస్‌లోనూ గొడవలు ఉంటాయి. కానీ, 80శాతం సర్దుకు పోతాయి. లవ్ మ్యారేజీ చేసుకోవడం ఉత్తమం. – ఎం.సుశాంత్, సీఎస్ఈ, సెకండ్ ఇయర్, నాచుపల్లి జేఎన్టీయూ

అరెస్ట్ చేయకుంటే ఆందోళనలు ఉధృతం

- రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు



రెడ్డి సంక్షేమ సంఘం నాయకుల ర్యాలీ

జగిత్యాలక్రైం: నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గడ్డం జలపతిరెడ్డి తన ఇద్దరు కూతుళ్లతో సహా ఆత్మహత్య చేసుకోవడానికి న్యాయవాది వేధింపులే కారణమని, ఆయనను అరెస్ట్ చేయాలని రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ధరూర్ శివారులోని రెడ్డి సంక్షేమ సంఘం కల్యాణ మండపం నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద జగిత్యాల–కరీంనగర్ రహదారిపై బైఠాయించారు. న్యాయవాదిని అరెస్ట్ చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. పట్టణ సీఐ కిశోర్ చొరవతో ఆందోళనకారులు నిరసన విరమించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేశారు. రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎడ్మల శైలేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంగోపాల్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి, నాయకులు దేవేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పన్నాల తిరుపతిరెడ్డి, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, తాటిపర్తి విజయలక్ష్మి, శోభారాణి, నాగిరెడ్డి రజిత, వరలక్ష్మి, గడ్డం రమ పాల్గొన్నారు. జలపతిరెడ్డి ఆత్మహత్యకు కారణమైన న్యాయవాదిని బార్ అసోసియేషన్ నుంచి తొలగించాలని కోరుతూ జగిత్యాల బార్ అసోసియేషన్‌లో ఫిర్యాదు చేశారు.

న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలి

న్యాయవాది దామోదర్‌రావుపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో కలిసి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డీజీపీ అంజన్‌కుమార్ యాదవ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు.

- రంగంలోకి దిగిన ఉద్యోగులు, రాజకీయ నాయకులు
- బంధువులు, తమ సన్నిహితుల పేర్లతో జాబితా తయారు
- తూతూమంత్రంగా పరీక్ష నిర్వహణ
- వందకు 13 మార్కులు వచ్చిన వారికి కూడా ఉద్యోగాలు
- ఈ – పంచాయతీ గ్రామాల్లో యంత్రాంగం ఇష్టారాజ్యం

ఆపరేటర్ ఉద్యోగాల్లో అక్రమాలు!


జగిత్యాలరూరల్: జిల్లాలోని ఈ – పంచాయతీల్లో కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం అస్తవ్యస్తంగా తయారైంది. జిల్లా వ్యాప్తంగా 380 గ్రామపంచాయతీలు ఉండగా గతంలో 53మంది ఆపరేటర్లను నియమించారు. అవసరాల దృష్ట్యా మరో 18 మంది ఆపరేటర్ల నియామకం కోసం ఆర్నెల్ల క్రితం కలెక్టర్ అనుమతి ఇచ్చారు. ఇందుకోసం ఎంపీడీవోలు, ఎంపీవోలు నోటిఫికేషన్ జారీచేసి అర్హులైన వారినుంచి దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంది. కానీ, కొందరు ఉద్యోగులు, రాజకీయ నాయకులు రంగ ప్రవేశం చేశారు. నోటిఫికేషన్ జారీచేయకుండానే నేరుగా దరఖాస్తులు స్వీకరించారు. తమకు నచ్చినవారి పేర్లతో జాబితా తయారు చేశారు.

పరీక్ష నామమాత్రం..

మొత్తం 18 ప్రాంతాల్లో కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం కోసం మండలస్థాయి అధికారులు ఒక్కో పోస్టుకు ఇద్దరిని ఎంపికచేసి జాబితా తయారు చేశారు. దానిని ఈ – పంచాయతీ జిల్లా ప్రాజెక్టు మేనేజరుకు అప్పగించారు. అక్కడ ఒక ప్రశ్నపత్రం తయారు చేశారు. కొడిమ్యాల మండలం జేఎన్టీయూలో ఇటీవల అభ్యర్థులకు నామమాత్రంగా పరీక్ష నిర్వహించారు.

నిబంధనలకు విరుద్ధంగా..

- అవుట్ సోర్సింగ్ పద్ధతిన కంప్యూటర్ ఆపరేటర్లను ఎంపిక చేయాల్సి ఉంది.
- కానీ, నిబంధనలకు విరుద్ధంగా, నోటిఫికేషన్ జారీచేయకుండా కొన్ని మండలాల్లో అధికారులు తమకు నచ్చినవారి దరఖాస్తులు స్వీకరించారని ఆరోపణలు వచ్చాయి.
- ఒకపోస్టుకు రెండు దరఖాస్తులే స్వీకరించారని, చివరకు తమకు అనుకూలమైన వారినే ఈ–పంచాయతీల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా ఎంపిక చేశారని విమర్శలు ఉన్నాయి.
- మరోముఖ్య విషయం ఏమిటంటే.. ఉన్నత విద్యావంతుల దరఖాస్తులను అధికారులు తిరస్కరించినట్లు తెలిసింది.
- అంతేకాదు.. పరీక్షలో 100కు 13 మార్కులు వచ్చిన వ్యక్తిని కూడా ఆపరేటర్ ఉద్యోగానికి ఎంపిక చేసినట్లు చర్చించుకుంటున్నారు.



వందకు 13 మార్కులు వచ్చినట్లు ఇచ్చిన నివేదిక



ఓ అభ్యర్థి సమర్పించిన నకిలీ కంప్యూటర్ సర్టిఫికెట్

- మొత్తంగా ఈ ప్రక్రియలో పెద్దమొత్తంలో డబ్బు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

విచారణ పేరిట బెదిరింపులు

అన్ని అర్హతలు ఉన్నా తనకు ఉద్యోగం రాలేదని పేర్కొంటూ ఓ నిరుద్యోగి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తనకంటే తక్కువ విద్యార్హతలు ఉన్నా, అనుభవం లేనివారికీ ఉద్యోగం ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్.. సమగ్ర విచారణ జరపాలని డీపీవోను రెండు నెలల క్రితం ఆదేశించారు. అయితే, డీపీవోకు బదులు డీఎల్‌పీవో రంగంలోకి దిగారు. ఫిర్యాదుదారును తన కార్యాలయానికి పిలిపించారు. అసలు విషయం కాకుండా.. డీపీవో ముందు విచారణకు హాజరైనట్లు తనకు లేఖ రాసి ఇవ్వాలని బాధితుడిని డీఎల్‌పీవో బెదిరించారని ఆరోపణలు వచ్చాయి. తను అలా ఎందుకు రాసిస్తానని నిరుద్యోగి బదులిచ్చాడని తెలిసింది.

మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు..

అన్ని అర్హతలు ఉన్న తనను కాదని అనర్హులకు కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఇచ్చారని పేర్కొంటూ బాధితుడు మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు చేశాడు. తనకు న్యాయం చేయాలని విన్నవించారు. పీఎంవో, కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి, బీజేపీ నేత బండి సంజయ్‌కు కూడా ట్విటర్ ద్వారా ఫిర్యాదు చేశాడు.

విచారణ జరిపిస్తాం



జిల్లాలోని ఈ – పంచాయతీలకు అవసరమైన 18మంది కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం కోసం కలెక్టర్ నుంచి అనుమతి తీసుకున్నాం. అవుట్ సోర్సింగ్ పద్ధతిన ఎంపికచేసే ఈ ఉద్యోగాల కోసం ఎంపీడీవోలు, ఎంపీవోలు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారి జాబితా మాకు అందజేశారు. ఈమేరకు పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన అభ్యర్థులను ఎంపిక చేశాం. నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. – నరేశ్, జిల్లా పంచాయతీ ఇన్‌చార్జి అధికారి

వెలుగులోకి నకిలీ సర్టిఫికెట్ల బాగోతం..

ఈ–పంచాయతీల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా ఉద్యోగం పొందినవారిలో చాలామంది నకిలీ కంప్యూటర్ సర్టిఫికెట్లు సమర్పించినట్లు తెలిసింది. బాధితులు కొందరు.. సర్టిఫికెట్లపై ఆరా తీయగా.. అవి జారీచేసిన కంప్యూటర్ సెంటర్ల చిరునామా కూడా లేదని తెలిసింది.

క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొన్న లారీ


ధ్వంసమైన విద్యుత్ స్తంభం

జగిత్యాలక్రైం: జగిత్యాల పాత బస్టాండ్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున మట్టి లోడుతో అతివేగంగా వెళ్తున్న లారీ డివైడర్‌ను ఢీకొనడంతో సెంట్రల్ లైటింగ్ స్తంభం విరిగి ధ్వంసమైంది. లారీ ముందు భాగం చక్రాలు ఊడి రోడ్డుపై పడ్డాయి. ఉదయం వేళ కావడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. మున్సిపల్ అధికారి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన రహీంపాషాను అతడి స్నేహితుడు వజీర్ పాషాను చంపుతానని బెదిరించిన గట్ల గాంధీపై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై అనిల్ సోమవారం తెలిపారు. రహీం పాషా తన స్నేహితుడు వజీర్‌ను ఆదివారం రాత్రి ఇంటి వద్ద ఉండగా పాత గొడవలు మనసులో ఉంచుకుని గట్ల గాంధీ.. బూతులు తిడుతూ చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. తనచేతిలో ఉన్న ఇనుపపంచ్‌తో తలపై దాడిచేయగా గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై..

ఇబ్రహీంపట్నం(కోరుట్ల):పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ సోమవారం తెలిపారు. యామాపూర్‌లోని మున్నూరుకాపు సంఘ భవనంలో ఆదివారం రాత్రి గ్రామస్తులు కాశ ప్రశాంత్, చెదలు రమేశ్ మధ్య గొడవ జరిగింది. డయల్ 100 నంబరుకు అందించిన సమాచారంతో ఏఎస్సై జమీల్, హెడ్ కానిస్టేబుల్ గంగారాం అక్కడకు వెళ్లారు. అయితే, అక్కడ ఉన్న బండాల శ్రీను, రమేశ్, బండాల రాజు కలిసి పోలీసులపై తిరగబడ్డారు. విధులకు ఆటంకం కలిగించారు. ఈమేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మహిళ అదృశ్యం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన వరికుప్పల లక్ష్మి అదృశ్యమైనట్లు ఆమె భర్త నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ సోమవారం తెలిపారు. వరికుప్పల నర్సయ్య – లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. తనకు కడుపు నొప్పి వస్తోందని, ట్యాబ్లెట్లు తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పిన లక్ష్మి ఆదివారం రాత్రి 7గంటల సమయంలో బయటకు వెళ్లింది. రాత్రి వరకూ తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికారు. అయినా, ఆచూకీ లభ్యం కాలేదు. భర్త నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

మహిళా సంఘాల ద్వారా మామిడి కొనుగోళ్లు

- కార్పొరేట్ సంస్థలతో సెర్ప్ ఒప్పందాలు
- ఏడు మండలాల్లో సేకరణకు సన్నద్ధం


మామిడి కాయలను గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

జగిత్యాలఅగ్రికల్చర్: మామిడి రైతులు దళారుల బారిన పడకుండా, గిట్టుబాటు ధర కల్పించేలా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) రంగంలోకి దిగింది. జగిత్యాల జిల్లాలో ఎంపిక చేసిన ఏడు మండలాల్లో మహిళా సంఘాల ద్వారా మామిడి కొనుగోళ్లు చేయాలని నిర్ణయించింది. కొనుగోలు చేసిన కాయలను కమీషన్ ప్రాతిపాదికన కార్పొరేట్ సంస్థలైన రిలయన్స్, బిగ్ బాస్కెట్, రత్నదీప్, ఫ్లిఫ్ కార్ట్‌లతోపాటు హైదరాబాద్ బోయినపల్లి, ఢిల్లీ, హర్యాణా, నాగపూర్ పండ్ల మార్కెట్‌లకు తరలించాలని కూడా నిర్ణయించింది. ఇందుకోసం ఆయా సంస్థలతో ఒప్పందాలు చేసుకునే పనిలో పడింది.

మహిళా సంఘాలకు శిక్షణ

- మామిడికాయల కోత, గ్రేడింగ్, తరలింపు వంటి అంశాలపై రైతులు, మహిళలకు శిక్షణ ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు.
- ఎంపిక చేసిన రైతులతోపాటు మహిళా సంఘాల సభ్యులకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు.
- కొన్ని కార్పొరేట్ సంస్థలు ఇబ్బందులు పెడుతుండటంతో కాయను పండుగా మార్చి నేరుగా దుకాణాల ద్వారా విక్రయించాలని కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

మూడేళ్లుగా కొనుగోళ్లు..

జిల్లాలో స్త్రీ, ధరణి మహిళా ఫార్మర్స్ సొసైటీ ద్వారా రైతులకు నచ్చిన ధరను చెల్లిస్తూ, మామిడి కాయలు కొనుగోలు చేస్తున్నారు. 2018–19లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి.. ఆ ఏడాది 39.53 మెట్రిక్ టన్నులు సేకరించారు. 2019–20లో సుమారు 42.7 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఓపెన్ మార్కెట్‌లో కిలో రూ.25 వరకు ఉంటే, కిలోపై రూ.2 – రూ.3 వరకు అధిక ధర చెల్లించారు. 2020–21లో కరోనా నేపథ్యంలో కేవలం 19 మెట్రన్నులు కొనుగోలు చేయగా, గతేడాది కొనుగోలుదారుల కొరత ఏర్పడి కొనుగోళ్లు సాగలేదు. ఈ ఏడాది(2022–23)లో దాదాపు 500 మెట్రిక్ టన్నుల – 1,000 మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయాలని నిర్ణయించారు.

ఏడు మండలాలు ఎంపిక..

- మామిడి కాయలు కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చిన జిల్లాలోని రాయికల్, కోరుట్ల, మల్లాపూర్, మేడిపల్లి, గొల్లపల్లి, సారంగాపూర్, కొడిమ్యాల మండలాల్లోని మహిళా సంఘాలను ఎంపిక చేశారు.
- కాయలు తెంపడం నుంచి అమ్మే వరకూ అన్ని అంశాలపై మహిళలకు శిక్షణ ఇస్తున్నారు.
- సొన కారకుండా కాయలు ఎలా తెంపాలి, తెంపిన తర్వాత ఎలా గ్రేడింగ్ చేయాలి, గ్రేడింగ్ చేసి న తర్వాత ఎలా ప్యాకింగ్ చేసి, రవాణా చేయాలనే అంశాలపై ఉద్యానశాఖ శిక్షణ ఇస్తోంది.

రైతులకు ఏం ఉపయోగమంటే..

ఒప్పందం మేరకు మహిళా సంఘాల సభ్యులు మామిడి కాయలను రైతుల సమక్షంలోనే తెంపుతారు. వాటిని తోట నుంచి తీసుకెళ్లేటప్పుడే నగదు లేదా 48 గంటల్లో చెల్లింపులు చేసేలా అధికారులు పూచీకత్తు ఇస్తారు. దళారుల ప్రమేయం లేకుండా మహిళలే నేరుగా కొనుగోలు చేస్తారు. సూట్, రాటన్ అంటూ ఏదీ తీసివేయరు. తరుగుకు కూడా అవకాశం లేదు. ఎంపిక చేసినవే కాకుండా ముందుకు వచ్చే రైతుల నుంచికూడా కాయలు కొనుగోలు చేస్తారు. ఆశించిన స్థాయిలో కొనుగోలుదారులు లభించకుంటే ఇతర జిల్లా కేంద్రాలతో పాటు హైదరాబాద్ లాంటి మెట్రో సిటీల్లో దుకాణాలు ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

కాయలు కొనుగోలు చేస్తున్నాం



రెండేళ్లుగా తోటల నుంచి మామడి కాయలు కొనుగోలు చేస్తున్నాం. పెద్దగా లాభాపేక్ష చూసుకోకుండా, రైతులకు మంచి ధర వచ్చేలా గిట్టుబాటు కల్పిస్తున్నాం. ఏ రోజు కాయ తెంపితే .. ఆ రోజు ఏ ధర ఉంటుందో దానిని బట్టి ధర నిర్ణయిస్తాం.
– మానస, మహిళా సంఘం అధ్యక్షురాలు, గొల్లపల్లి

ధర పడిపోకుండా



మహిళా రైతు సంఘాలు మామిడి కాయలు కొనుగోలు చేయడం వల్ల ఓపెన్ మార్కెట్‌లో వ్యాపారులు ధర తగ్గించడం లేదు. గ్రేడింగ్‌ను బట్టి ఓపెన్ మార్కెట్ కంటే రూ.1 – రూ.2 అధికంగానే చెల్లిస్తున్నాం. రైతులకు అదేరోజు లేదా 48 గంటల్లో డబ్బులు చెల్లిస్తున్నాం.
– సూదం వెంకటేశ్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్, సెర్ప్

ఈసారి కూడా కొనుగోళ్లు



ఈఏడాది కూడా మహిళా సంఘాల ద్వారా మామిడి కాయలు కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇందుకోసం కార్పొరేట్ సంస్థలతో ఓ వైపు ఒప్పందాలు చేసుకుంటూనే, మరోవైపు మహిళలతో దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయించేందుకు యత్నిస్తున్నాం.
– లక్ష్మీనారాయణ, డీఆర్డీవో

రూ.వంద కోట్లు కేటాయించడం అభినందనీయం


రవిశంకర్‌ను సన్మానిస్తున్న అధికారులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి సీఎం కేసీఆర్ రూ.100 కోట్లు కేటాయించడం అభినందనీయమని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. సోమవారం ఆయన స్వామివారిని దర్శించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. అంజన్న సన్నిధిలో అనేక మంది నాయకులు, పాలకులు ముడుపులు కట్టి కోరికలు నేరవేర్చుకుంటారని, ఆలయ అభివృద్ధికి పైసా కూడా ఇవ్వరని అన్నారు. కానీ, సీఎం కేసీఆర్ అంజన్న ఆలయ అభివృద్ధికి రూ.వంద కోట్లు కేటాయించారని పేర్కొన్నారు.

'రాజ్ కహానీ' పోస్టర్ విడుదల



కోరుట్ల: పట్టణానికి చెందిన రాజ్‌కార్తీకేన్ స్వీయ దర్శకత్వంలో నిర్మాత, హీరోగా తెరకెక్కించిన చిత్రం రాజ్‌కహాని సినిమా పోస్టర్‌ను రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ, రాజ్ కహాని చిత్రం అమ్మ ప్రేమను అంతర్లీనంగా, అమ్మాయి ప్రేమ ఇతివృత్తంగా తీసుకొని తెరకెక్కించిన రాజ్ కార్తికేన్‌ను అభినందించారు. ఈ సినిమా సూపర్ హిట్ కావాలని మంత్రి ఆకాంక్షించినట్లు రాజ్ కార్తికేన్ తెలిపారు.

కేంద్రప్రభుత్వం చేసిందేమీలేదు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు


క్రీడా ప్రాంగణం ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మల్లాపూర్(కోరుట్ల): కేంద్రప్రభుత్వం దేశ ప్రజలకు చేసిందేమీ లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు విమర్శించారు. మండల కేంద్రంతోపాటు వాల్గొండ, పాతదాంరాజుపల్లి, కొత్తదాంరాజుపల్లి, సంగెం–శ్రీరాంపూర్, ఒబులాపూర్, మొగిలిపేట, నడికుడ, రాఘవపేట, హుస్సేన్‌నగర్, ముత్యంపేట గ్రామాల్లో కొత్త గ్రామ పంచాయతీ భవనాలు, సీసీరోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. పలు గ్రామాల్లో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌తోపాటు నిత్యావసరాల ధరలు పెంచి సామాన్య, పేదలు, రైతులపై ఆర్థిక భారం మోపుతోందని ధ్వజమెత్తారు. విపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేసి, ఏకపార్టీగా బీజేపీ గుత్తాధిపత్యం సాధించడం లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఆరోపించారు. ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గొరు నాగేశ్, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, ఎంపీడీవో రాజశ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్, ఏఈ అన్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్రిక్తల నడుమ విగ్రహావిష్కరణ

కొత్తదాంరాజుపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ సందర్భంగా ప్రొటోకాల్ పాటించలేదంటూ నిర్వాహకులపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వల్ప ఉద్రిక్తత చోటచేసుకోవడంతో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో పరిస్థితిని చక్కదిద్దారు. ఆ తర్వాత ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని విద్యాసాగర్‌రావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సుపరిపాలనతో మతసామరస్యాన్ని చాటిన ఛత్రపతి శివాజీ స్ఫూర్తిప్రదాత అన్నారు.

బస్సు ప్రమాద బాధితులకు న్యాయం చేయండి

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.వంద కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామని, ఇదే సమయంలో ఆలయ ఘాట్‌రోడ్డుపై జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో మృతి చెందినవారి కుటుంబాలకు న్యాయం చేయాలని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈనెల 15న సీఎం కేసీఆర్ కొండగట్టు పర్యటన సందర్భంగా పొన్నం ప్రభాకర్ సోమవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. కొండగట్టు ఘాట్‌రోడ్డు ప్రమాదంలో మరణించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పైసా సాయం అందలేదన్నారు. మృతుల కుటుంబాల పరిస్థితి, తీవ్రగాయాపాలైన వారి ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. విశిష్టమైన ఆలయ మెట్లదారిని అభివృద్ధి చేయాలన్నారు. భక్తుల కోసం మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని, కొండగట్టు నుంచి వేములవాడ, ధర్మపురి క్షేత్రాలకు ప్రయాణ సౌకర్యం మెరుగు పర్చాలన్నారు. కొండగట్టులో నిద్రచేస్తే మానసిక వ్యాధుల నుంచి విముక్తి కలుగుతుందని భక్తుల్లో విశ్వాసం ఉందని, వారికోసం గుట్టపై కాటేజీలు, ధర్మశాలలు నిర్మించాలని ఆయన కోరారు.

నేడు ఆరోగ్య మేళాలు

మల్యాల(చొప్పదండి): జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14న ఆరోగ్య మేళాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో శ్రీనివాస్ సోమవారం తెలిపారు. జిల్లాలోని 151 ఆరోగ్య ఉప కేంద్రాల్లో శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తామని పేర్కొనఆనరు. సైక్లింగ్, టీబీ, కుష్ఠు, క్యాన్సర్ నియంత్రణ, నివారణలపై అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఆరోగ్య మేళాల్లో అన్నివర్గాలు పాల్గొనాలని ఆయన సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'మీరు నేను'

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

రాయికల్(జగిత్యాల): గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికే మీరు నేను కార్యక్రమం ప్రారంభించినట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి రాయికల్ మండలం మైతాపూర్‌లో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ గ్రామంలో పర్యటించి ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకొని సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటింటా చేరుతున్నాయా తెలుసుకొని చేరకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు,వైస్‌చైర్మన్ గండ్ర రమాదేవి, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచ్ అజారొద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గన్నె రాజిరెడ్డి, నాయకులు తలారి రాజేశ్, కిష్టయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ జెండా ఎగురవేస్తాం

- పార్టీ చొప్పదండి ఇన్‌చార్జి సత్యరాజ్‌వర్మ


మాట్లాడుతున్న సత్యరాజ్‌వర్మ

మల్యాల(చొప్పదండి): ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పాదయాత్ర చేపట్టిన వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిలకు ప్రజలు నీరాజనం పడుతున్నారని ఆ పార్టీ చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యరాజ్‌వర్మ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో పలువురు వైఎస్సార్‌టీపీలో చేరారు. సత్యరాజ్‌వర్మతోపాటు పార్టీ జిల్లా అధ్యక్షురాలు గాదె స్రవంతి.. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నాయకులతో కలిసి సత్యరాజ్‌వర్మ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్షులు, ఇటీవల పార్టీలో చేరిన వివరాలతో కూడిన నివేదికను పార్టీ అధినేత్రి షర్మిలకు అందజేశామన్నారు. ఈనెల 15 – మార్చి 30వ తేదీ వరకు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పూర్తిస్థాయి కమిటీలు వేస్తామని అన్నారు. వైఎస్సార్‌టీపీలో చేరేందుకు ప్రజలు ఆసక్తిగా ఉన్నారని, విద్యావంతురాలు గాదె స్రవంతి పార్టీలో చేరడం మరింత బలం చేకూరిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలను ప్రజలు మరిచిపోలేదని అన్నారు. తెలంగాణలో వైఎస్సార్ టీపీ ప్రభంజనం సృష్టించబోతుందని సత్యరాజ్‌వర్మ అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పుల శంకర్, మేక శ్రీనివాస్, ఉప్పుల ఉమాదేవి, రమాదేవి, గాదె శ్రీనివాస్, ఎల్లాల రాజిరెడ్డి, అరుణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మృతుడు గల్ఫ్ కార్మికుడు


గెల్లె రాజేశ్(ఫైల్)

కోరుట్లరూరల్: యూసుఫ్‌నగర్ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అయిలాపూర్ గ్రామానికి చెందిన గెల్లె రాజేశ్(36) మృతి చెందాడు. రాజేశ్ పనినిమిత్తం యూసుఫ్‌నగర్ వెళ్లాడు. పని ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యాడు. రాత్రి యూసుఫ్‌నగర్ శివారులోని తాతమ్మ ఆలయం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు అంబులెన్సులో కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

15 రోజుల క్రితమే గల్ఫ్ నుంచి ..

రాజేశ్ 8 ఏళ్లుగా గల్ఫ్‌లో కార్మికుడిగా పనిచేస్తూ సెలవులపై స్వగ్రామానికి వచ్చి వెళ్తున్నాడు. ఈక్రమంలో 15 రోజుల క్రితమే రెండు నెలల సెలవులపై ఇంటికి వచ్చాడు. ఆయనకు భార్య మమత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటిపెద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. తండ్రి కోసం కుమారులు రోదించిన తీరు పలువురిని కలచివేసింది. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలు..

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందింది. గ్రామస్తులు, పోలీసుల వివరాలు.. రాంపూర్‌కు చెందిన మూదం చంద్రకళ(60) హుజూరాబాద్– జమ్మికుంట ప్రధాన రహదారిపై వెళ్తున్న క్రమంలో లారీ అతివేగంగా వచ్చి వెనుకనుంచి ఢీకొట్టడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు పొలంలో పడి మహిళ..

ఇల్లందకుంట(హుజూరాబాద్): ప్రమాదవశాత్తు ఓ మహిళ పొలంలో పడి మృతిచెందిన ఘటన మండలంలోని మల్లివానిపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్తుల వివరాలు.. మల్లివానిపల్లికి చెందిన కనుకుల జయ(40) సోమవారం వ్యవసాయ పనుల నిమిత్తం తన చేనులో కలుపు తీయడానికి ఉదయం 7గంటలకు ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా వ్యవసాయ బావి వద్ద నిర్జీవంగా పడి ఉంది. జయ చిన్న కుమారుడు వినయ్ గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతురాలి భర్త కేశవ్‌రెడ్డికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో కుటుంబ బాధ్యతలు జయ చూసుకుంటుందని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

- రూ.1.79 లక్షలు మాయం

చందుర్తి(వేములవాడ): దుర్గమ్మకు మొక్కులు చెల్లించేందుకు తాళం వేసి వెళ్లగా.. అదే అవకాశంగా ఇంట్లో చొరబడ్డ దొంగలు నగదు ఎత్తుకెళ్లారు. కోనరావుపేటకు చెందిన కస్తూరి రాజేందర్‌రెడ్డి పొలం వద్ద నెలకొల్పుకున్న దుర్గమ్మకు బోనాలు తీసేందుకు కుటుంబ సభ్యుల సమేతంగా వెళ్లారు. మొక్కులు చెల్లించుకుని అదే రోజు రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంట్లోకి వచ్చి చూసేసరికి ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో దాచుకున్న రూ.1.79లక్షలను ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోతున్నారు. పోలీసులు ఇంట్లో చిందర వందరగా పడి ఉన్న వస్తువులను పరిశీలించి వెళ్లారు. కాగా గ్రామస్తులు మాత్రం తెలిసిన వారే దొంగతనానికి పాల్పడ్డారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వనదర్శినితో అడవులపై అవగాహన


విద్యార్థులతో అటవీ అధికారులు

మల్లాపూర్(కోరుట్ల): వనదర్శిని కార్యక్రమంతో విద్యార్థులకు అడవులపై సంపూర్ణ అవగాహన కలుగుతుందని రాయికల్ రేంజ్ అటవీ అధికారి భూమేశ్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను అటవీ ప్రాంతంలో క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లారు. అడవులపై అవగాహన కల్పించారు. సమస్త ప్రాణకోటి మనుగడకు అటవీసంపద జీవనాధారమన్నారు. పర్యావరణ సమతుల్యతలో అడవులదే ప్రత్యేక పాత్ర అని పేర్కొన్నారు. వనసంరక్షణ, పర్యావరణ సమతాస్థితి, జీవవైవిధ్యం, అడవులతో కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. డిప్యూటి రేంజ్ అటవీ అధికారి చంద్రమౌళి, సెక్షన్ అధికారి విజయ్‌కుమార్, బీట్ అధికారి సత్తార్, వీఎస్ఎస్ చైర్మన్ సిరిపురం రవీందర్, హెచ్ఎం అనిత, ఉపాధ్యాయులు విక్రమ్, రాజేందర్, గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈతవనం దగ్ధం


దావన్‌పల్లిలో దగ్ధమైన పశువుల కొట్టం

మల్లాపూర్(కోరుట్ల): ముత్యంపేట శివారులో సోమవారం ప్రమాదవాశాత్తు ఈతవనం దగ్ధమయింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామ శివారులో ప్రమాదవాశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు 1,000కిపైగా ఈతచెట్లు పూర్తిగా కాలిపోయాయి. మెట్‌పల్లి అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. ఈత వనంపైనే ఆధారపడ్డ గీతకార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు జీఎస్ వెంకట్ దగ్ధమయిన ఈతవనాన్ని పరిశీలించారు. బాధితులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పశువుల కొట్టం..

రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలం దావన్‌పల్లిలో సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మాలోవత్ ప్రసాద్‌కు చెందిన పశువుల కొట్టం దగ్ధమైంది. గడ్డివాము దగ్ధమై రెండు దూడపిల్లలు మృతి చెందగా, రూ.6లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అన్నపై కత్తితో దాడి

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లో అన్నపై కత్తితో తమ్ముడు దాడిచేశాడు. స్థానికులు తెలిపిన వివరాలు. రాజీవ్‌నగర్‌కు చెందిన కాసారపు నారాయణకు ఇద్దరు కుమారులు సాగర్, చందు. సాగర్ ఆదేశాలనీలో వడ్రంగి షాపు నిర్వహిస్తూ వేరుగా జీవిస్తున్నాడు. చందు తల్లిదండ్రులతో ఉంటూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈక్రమంలో తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. సోమవారం అన్న సాగర్‌తో గొడవ పడి కత్తితో దాడి చేశాడు. సాగర్ చేతిపై గాయం కాగా.. అడ్డుకునేందుకు వచ్చిన బ్రహ్మచారికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. నిందితుడు పరారైనట్లు స్థానికులు తెలిపారు.

అప్పుల బాధతో వృద్ధుడు ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌కు చెందిన కల్వల రాజేశం (60) అప్పుల బాధతో సోమవారం తాటివనంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై రాజేశ్ తెలిపారు. గీత వృత్తిపై ఆధారపడిన రాజేశం.. ఇటీవల ఇంటి నిర్మాణం కోసం అప్పు చేశాడు. ఆ అప్పు తీర్చలేక మదనపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

అనారోగ్యంతో ఒకరు..


రవీందర్ (ఫైల్)

జ్యోతినగర్:అనారోగ్యంతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎన్టీపీసీ రామగుండంలో సోమవారం చోటుచేసుకుంది. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌కు చెందిన చొల్లేటి రవీందర్ (62) ఆటోడ్రైవర్. కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకున్నాడు. రవీందర్ భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఏఎస్సై చక్రపాణి తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ వద్ద సోమవారం పోలీసులు పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాలు. కరీంనగర్ నుంచి గంగాధర మీదుగా ఫాజుల్‌నగర్ వస్తుండగా ఈ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. దాదాపు 25 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.